క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



ఉయ్యూరు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత అని ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఇటీవల ఉయ్యూరు మండలం గండిగుంట ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాన్ని రెడ్ క్రాస్ ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. చైర్మన్ సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు చేతులమీదుగా రమాదేవి కుటుంబ సభ్యులకు రెడ్ క్రాస్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, కోఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ శాఖల పని తీరుపై సమీక్ష జరుగునని తెలియజేశారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి మేరీమాత చర్చి సమీపంలో గత ఏడు సంవత్సరాలుగా గుండాల సరోజిని, పెంచలయ్య నివాసం ఉంటున్నారు. కాగా భర్త మట్టి పనులు చేస్తాడు. మద్యం సేవించి భార్యతో తరచు గొడవ పడుతుంటాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన మద్యం సేవించి భార్య భర్తలకు గొడవ జరగడంతో పెంచలయ్య కొడుకు మురళీకృష్ణ ఇంటికి వెళతానని బయటకు వెళ్లిపోయాడు. కానీ కొడుకు ఇంటికి వెళ్లలేదు. పెంచలయ్య ఆచూకీ తెలియకపోవడంతో భార్య సరోజిని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే ప్రగతి సాధ్యం



పెనమలూరు: సంపూర్ణ అక్షరాస్యతతోనే ప్రగతి సాధించవచ్చని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని వీఆర్ సిద్ధార్థ. ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి చదువు కోవడం వల్ల విజ్ఞానం పొందడమే కాకుండా ఉజ్వల భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని వివరించారు. ప్రతీ ఒక్కరిలో కర్తవ్య బోధన పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు శంకుస్థాపన

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో రూ. 13 లక్షలతో నూతన మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని మంచినీటి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకు తాడిగడప మున్సిపాలిటీ నుంచి రూ. 13 లక్షలు మంజూరు చేసి పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టీడీపీ నేతలు వెలగపూడి బాబురావు, అనంతనేని అజాద్, అనుమోలు ప్రభాకరరావు, ముప్పవరపు నారాయణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

- నాలా చెల్లింపునకు గండి
- డెవలప్‌మెంట్ చార్జీలు నిల్
- చోద్యం చూస్తున్న సీఆర్‌డీఏ అధికారులు



చోడవరంలో అక్రమ లేఅవుటు

పెనమలూరు: మండల పరిధిలో అక్రమార్కులు చెలరేగి పోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికారులు ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, ఇళ్ల స్థలాలు కొనేవారు నిట్టనిలువునా మోసపోతున్నారు. వివరాల్లోకి వెళితే పెనమలూరు మండలం విజయవాడకు కూతవేటు దూరంలో ఉండటంతో నివాస స్థలాలకు డిమాండ్ ఉంది. నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాల లేఅవుట్లు సీఆర్‌డీఏ అనుమతులు తీసుకుని వేయాల్సి ఉంది. వ్యవసాయ భూములకు ల్యాండ్ కన్వర్షన్ కింద రెవిన్యూ శాఖకు నాలా చెల్లించాలి. అయితే పెనమలూరులో ఎటువంటి చట్టాలు అమలు జరగడం లేదు. అధికార పార్టీ నేతల అండదండలు ఉంటే అక్రమ లేఅవుట్ల దందా అడ్డగోలుగా చేయవచ్చని రుజువు చేస్తున్నారు. మండల పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తున్నా సీఆర్‌డీఏ, రెవిన్యూ, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధికార పార్టీ నేతలకు కప్పం కడితే చాలు..

మండల పరిధిలో అక్రమ లేఅవుట్లకు అడ్డాలు ఉన్నాయి. యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం కరకట్ట దిగువున కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కువగా లేఅవుట్లు వేస్తున్నారు. ఇప్పటికే వేసిన అక్రమ లేఅవుట్లల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే తాడిగడప డొంక రోడ్డు, తాడిగడప ప్రాంతాల్లో కూడా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. ప్రభుత్వానికి డెవలప్‌మెంట్ కింద నయా పైసా చెల్లించడం లేదు. కేవలం అధికార పార్టీ నేతలకు కప్పం కడితే మండలంలో ఎవరైనా ఎక్కడైనా అక్రమ లేఅవుట్లు వేయవచ్చని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నిద్రావస్థలో ఉన్న అధికారులు మేల్కొని తగిన చర్యలు తీసుకుంటే ప్రభుత్వ ఖజానాకు న్యాయం జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు.

అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పణ



పెదపులిపాకలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు



ఆత్కూరులో ఆషాఢ మాసం సారెను సమర్పించేందుకు వస్తున్న భక్తులు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి శ్రీవిజయ సుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ఆషాఢ మాసం సారె సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి సారె, పసుపు, కుంకుమ, పండ్లు, గాజులు, పూలు, పూజా సామాగ్రి అమ్మవారికి అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటమట, తాడిగడప ప్రాంత మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఆత్కూరులో కనకదుర్గ అమ్మవారికి

ఉంగుటూరు: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్కూరు గ్రామంలోని కనకదుర్గ అమ్మవారికి శుక్రవారం తేలప్రోలు నుంచి వచ్చిన భక్తులు ఆషాఢ మాసం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా గన్నవరం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు మాట్లాడుతూ ప్రతీ ఏటా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ మాసం సారెను సమర్పిస్తున్నామని తెలిపారు.

యువత స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి



ఎమ్మెల్యే యార్లగడ్డకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. బాపులపాడు మండలం రేమల్లేలో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో చల్లగుళ్ల పాండు నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్, ఫ్యాన్సీ షాపును యార్లగడ్డ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నైపుణ్య గణన చేపట్టిందని వివరించారు. అనంతరం గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్, నందమూరి హరికృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణి, మాజీ ఎంపీపీ తుమ్మల కోమలి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, యనమదల సుధాకర్ పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించండి సారూ..



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు పంచాయతీ అధికారులు గానీ, అటు రైల్వేస్టేషన్ సిబ్బందిగాని పట్టించుకోకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ముళ్ల పొదల నుంచి విషసర్పాలు వస్తున్నాయని, దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు గంజాయి బ్యాచ్, మందుబాబులు ఈ ప్రాంతాలకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాకంతో ప్రయాణికుల పడిగాపులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విశాఖపట్టణం నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు గురువారం అర్ధ రాత్రి రెండు గంటల సమయంలో మరమ్మతులకు గురికావడంతో వీరవల్లి వద్ద నిలిపివేశారు. ప్రయాణికులకు ఏమి చెప్పకుండా నిర్లక్ష్యంగా బస్సు డ్రైవర్, క్లీనర్‌లు వెళ్లిపోయారు. దీంతో అర్ధ రాత్రి గంటల తరబడి ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు పడ్డారు. ట్రావెల్స్ యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ సరైన స్పందన లభించలేదు. దీంతో ప్రయాణికులు వీరవల్లి పోలీసులను ఆశ్రయించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రావెల్స్ యాజమాన్యంతో సంప్రదింపులు జరిగి ప్రయాణికులను మరొక బస్సులో గమ్యస్థానాలకు తరలించారు.

ఘనంగా ఎన్టీఆర్ పశువైద్య కళాశాల వార్షికోత్సవం



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. పీవీఎస్ గ్రూప్ కంపెనీస్ ఎండీ డాక్టర్ పి.వెంకట శేషయ్య, స్టూడెంట్ అఫైర్స్ ఆఫ్ డీన్ డాక్టర్ జేవీ రమణ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలి

గన్నవరం: వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సత్వర వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మురుగునీటి పారుదల సక్రమంగా జరిగే విధంగా డ్రైయిన్లలో పూడికలు తొలగించాలని సూచించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ



కంకిపాడు: ప్లాస్టిక్ ప్రమాదకరమని, పేపర్ బ్యాగులే వినియోగించాలంటూ ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ వసంత క్యాంపస్ విద్యార్థులు శుక్రవారం వినూత్న రీతిన అవగాహన ర్యాలీ చేపట్టారు. కంకిపాడు ప్రధాన సెంటరులోని గన్నవరం రోడ్డు కూడలిలో ప్లకార్డులు, ప్లాస్టిక్ ముప్పును వివరిస్తూ గీసిన అందమైన చిత్రాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. వరల్డ్ పేపర్ బ్యాగ్స్ డే పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి సముద్రజల మట్టం పెరిగిపోవడానికి కారణమవుతుందని పేర్కొన్నారు. పేపర్ బ్యాగులు వినియోగించాలని, మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను విద్యాసంస్థ సీఈసీ ఎల్.సుధారాణి అభినందించారు.

కానూరులో బైక్ చోరీ

పెనమలూరు: బైక్ చోరీ జరిగిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్‌నగర్‌కు చెందిన కలపాల వంశీకృష్ణ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ రూమ్‌లో ఉంటాడు. అతను పని ముగించుకుని తన బైక్‌ను రూమ్ ముందు ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు అతని బైక్ చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు



దినేష్ చంద్ర



భార్గవి



ఎ.అరుణ



డి.సాత్విక



డి.హారిక



జి.దీపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం పి.నిర్మల తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 578 మార్కులు సాధించిన నెరుసు దినేష్ చంద్ర, 575 మార్కులు సాధించిన గొట్టాపు భార్గవి ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు సాధించారని పేర్కొన్నారు. వీరిని బాపులపాడు ఎంఈవో-1 శ్రీరామ్ బాలాసింగ్, ఎంఈవో-2 బి.సురేష్ కుమార్, హెచ్‌ఎం పి.నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

నున్న(విజయవాడరూరల్): నున్న జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.యుగంధర్ వెంకట దుర్గా ప్రసాద్ అనే విద్యార్థి పదో తరగతిలో 573 మార్కులు సాధించి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం వి.భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతను ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఉచిత విద్యాబోధనతో పాటు వసతి సదుపాయం కల్పిస్తుందన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎ.అరుణ, డి.సాత్విక నూజివీడు, డి.హారిక ఇడుపులపాయ, జి.దీపిక శ్రీకాకుళంలో సీట్లు సాధించారని అన్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

రసాభాసగా నున్న గ్రామ పంచాయతీ సమావేశం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన శుక్రవారం జరిగిన పంచాయతీ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. గ్రామంలో కొండవీడు వాగుపై కల్వర్టు నిర్మాణానికి సంబంధించి సభ్యుల మధ్య జరిగిన చర్చ సఫలీకృతం కాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి జెటివి.రమణ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మించాలని ఎప్పటి నుంచో అడుగుతున్నా వాటిని పట్టించుకోవడం లేదని అడగ్గా మీరు మండల పరిషత్ నుంచి గ్రాంటు మంజూరు చేసుకొని నిర్మించుకోవచ్చుగా అని సర్పంచి భర్త కాటూరి శ్రీనివాసరావు జోక్యం చేసుకోవడంతో వారి ఇరువురి మధ్య సమన్వయం లేకుండా పోయింది. పంచాయతీ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సలహాలు, సూచనలు మాత్రమే చేయాలని శ్రీనివాసరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం ఏకాభిప్రాయంతో జరగలేదు.

నాణ్యమైన సరుకులు అందించడమే లక్ష్యం



నిత్యావసరాల విక్రయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: నాణ్యమైన సరుకులు ప్రజలకు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు రైతుబజారులో పౌరసరఫరాల సంస్థ పర్యవేక్షణలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించి నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, తహసీల్దార్ రామకృష్ణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండల పరిధిలోని మూడు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ యనమలకుదురులో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు గ్రామం మొత్తం విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. అలాగే తాడిగడప సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో మొత్తం విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కానూరులో...

పెనమలూరు: కానూరు మురళీనగర్, మహదేవపురం కాలనీల సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కానూరు గ్రామంతో పాటు సనత్‌నగర్, బందర్ రోడ్డు, మురళీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేయాలి



నాయీ బ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గం

రామవరప్పాడు: నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ. 500 కోట్లు కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు అన్నారు. ఎనికేపాడులోని నరసయ్య ప్రాంగణంలో శుక్రవారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, కరెన్సీనగర్, మురళీనగర్‌ల్లోని నాయీ బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 27 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సూరిబాబు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన అన్ని జీవోలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అలాగే 300 యూనిట్ల విద్యుత్ రాయితీ ఇవ్వాలని, బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, నాయీ బ్రాహ్మణ వృత్తిలోకి కార్పొరేట్ల ప్రవేశాన్ని నిషేధిస్తూ జీవో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ నాయీ బ్రాహ్మణుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకునూరి సుబ్బారావు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసనకుర్తి ఈశ్వరరావు, తెన్నేటి సోమశేఖర్, నాయకులు రవిబాబు, కొయ్యపు నరేంద్ర, గుడివాడ రాజు, సతీష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు..

శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పసుపులేటి వెంకట్రావు, కార్యదర్శిగా సోమవరపు ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాగంటిపాటి సాయి కార్తీక్, వైస్ ప్రెసిడెంట్ పట్నాల మోహన్ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా ద్రాక్షారపు కిషోర్, ట్రెజరర్‌గా చాగంటిపాటి కల్యాణ్, గౌరవాధ్యక్షుడిగా నాగులవంచ బద్రి నారాయణ, గౌరవ సలహాదారులుగా కోసూరి శ్రీను, రాము, చిరంజీవి, చాగంటిపాటి రమేష్‌లను ఎన్నుకున్నారు.

క్షతగాత్రుడికి మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆటో ప్రమాదంలో గాయపడి జీవనోపాధి కోల్పోయిన బాధితుడికి మానవత సభ్యులు ఆర్థిక సాయం అందించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు యజ్ఞవరపు శ్రీనివాసరావు ఇటీవల ఆటోలో పనికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. గాయపడి ఇంటి వద్దే ఉంటున్న శ్రీనివాసరావును మానవత సభ్యులు శుక్రవారం పరామర్శించి తమ వంతుగా రూ. 8,500 ఆర్థిక సాయాన్ని అందించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జమరామచంద్రరావు, గణేష్, సీనియర్ సభ్యులు నారగాని కొండలరావు, పొట్లూరి శేషాచలం, వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కంప చెట్లతో వాహనదారులకు ఇక్కట్లు



పురుషోత్తపట్నం రోడ్డు మార్గంలో రోడ్డుపైకి వచ్చిన ముళ్ల కంపలు

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి మార్గంలో కంప చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ద్వారా పురుషోత్తపట్నం, ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని కంప చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.